క్లుప్తంగా

చాడ దంపతుల పూజలు



చాడ వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న ఈఓ కిషన్‌రావు

హుస్నాబాద్: పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ జాతర సందర్భంగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి దంపతులు బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి వారిని సన్మానించారు.

కిసాన్ మేళాలో స్టాల్స్



శ్రీనివాస్

హుస్నాబాద్‌రూరల్: రైతులకు వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగం, వినూతన పద్ధతులను వివరించే విధంగా కిసాన్ మేళాలో స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఏడీఏ శ్రీనివాస్ చెప్పారు. ఏడీఏ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితోనే హుస్నాబాద్‌లో కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 6, 7, 8వ తేదీలలో జరిగే ఈ మేళాను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తారని చెప్పారు. ఒక్కొక్క క్లస్టర్ నుంచి 100కు పైగా రైతులను తరలించాలని ఏఈఓలకు సూచించారు. బస్సులను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా రమేశ్‌కుమార్



రమేశ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ కమిషనర్‌గా కె.రమేశ్‌కుమార్ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. కోహిర్ మున్సిపల్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన మట్ట శ్రీనివాస్‌రెడ్డి సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. గతంలో రమేశ్‌కుమార్ ఏడాదిపాటు దుబ్బాక మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది సత్కరించారు.

సమష్టిగా పనిచేద్దాం

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి



మాట్లాడుతున్న పర్వత్‌రెడ్డి

సిద్దిపేటజోన్: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ఎస్టీయూ లక్ష్యమని, ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు కోసం బడిబాటలో సమష్టిగా పనిచేద్దామని ఎస్టీయూ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీఓ భవన్‌లో బుధవారం జరిగిన రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ఏకపక్షంగా సర్దుబాటు ఉత్తర్వులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బడిబాట తర్వాత విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో 11 నుంచి 60 వరకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలనే నిబంధన సరికాదని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో గజేందర్, రవి, శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, యాదగిరి, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



డీఈఈకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

సిద్దిపేటజోన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు బుధవారం డీఈఈ ప్రేరణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు రవి కుమార్ మాట్లాడుతూ జీఓ ప్రకారం వేతనాలను పెంచాలని, ప్రభుత్వం ప్రకటించిన పీఆర్సీ ప్రకారం కార్మికులకు వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, చంద్రం, వినోద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ శూన్యం

మున్సిపల్ పరిధిలో తడి, పొడిచెత్త సేకరణ చేపట్టినప్పటికీ డంపింగ్ యార్డు నిర్వహణ సరిగా లేక అధ్వానంగా తయారైంది. సేకరించిన చెత్త ఎక్కడపడితే అక్కడ పారవేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా స్వచ్ఛ దుబ్బాక లక్ష్యం నీరుగారుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డంపు యార్డు అధ్వానం

- నీరుగారుతున్న లక్ష్యం
- రూ.1.3 కోట్లతో నిర్మాణం
- జీతాలు లేక రాని సిబ్బంది
- దుర్వాసనతో ప్రజల ఇబ్బంది



దుమ్ము పట్టిన రీసైక్లింగ్ యంత్రాలు

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని లచ్చపేట శివారులో యేడేళ్ల క్రితం మూడు ఎకరాల్లో డంపింగ్ యార్డు నిర్మించారు. యేదాది క్రితమే సుమారు రూ.1.3 కోట్లతో డీఆర్ సీసీ (డ్రై రిసోర్సు కలెక్షన్ సెంటర్) కేంద్రం, వర్మి కంపోస్ట్(ఎరువు తయారీ) కేంద్రం, వే బ్రిడ్జీల నిర్మాణాలు పూర్తిచేశారు. ఇప్పటి వరకు యార్డును అధికారికంగా ప్రారంభించకున్నా రోజూ వాహనాల్లో తీసుకొచ్చిన చెత్తను డంపుయార్డులో వేస్తున్నారు.

ఆగిన రీసైక్లింగ్ ప్రక్రియ

ఆరు నెలల క్రితం తడి, పొడిచెత్తను వేరుచేసి కంపోస్టు గదుల్లో వేయడానికి ఇద్దరిని నియమించారు. కానీ వారికి జీతాలివ్వకపోవడంతో పనికి రావడం మానేశారు. ఫలితంగా చెత్తను రీసైక్లింగ్ చేసేవారు కరవయ్యారు. దీంతో వర్మి కంపోస్టు ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ ఊసే లేకుండా పోయింది.

దుమ్ము పట్టిన యంత్రాలు

డీఆర్సీసీ కేంద్రానికి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కాలేదు. దీంతో కేంద్రం, వే బ్రిడ్జి వృథాగా మారాయి. దీంతో రీసైక్లింగ్ చేసే యంత్రాలు దుమ్ము, ధూళితో నిండిపోయాయి. ఇటీవలే గుర్తు తెలియని వ్యక్తులు మోటారును ఎత్తుకెళ్లారని తెలిసింది.

బావులే.. డంపుయార్డులు

మున్సిపల్‌లో సేకరించిన చెత్తను పూర్తిస్థాయిలో యార్డుకు తరలించకుండా పట్టణ శివారు ప్రాంతాలు, పాడుబడిన బావులు, చెరువుకట్టలపై పారవేస్తున్నారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తను తగలబెట్టడం వల్ల వాయు, నీటి కాలుష్యంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా యార్డు, డీఆర్సీసీ కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు వచ్చి సేంద్రియ ఎరువులు ఉత్పత్తి చేసి రైతులకు విక్రయిస్తే మున్సిపల్‌కు ఆదాయం సమకూరే అవకాశం ఉందని ప్రజలంటున్నారు.



గుర్తు తెలియని వ్యక్తి తగులబెట్టిన చెత్త

వినియోగంలోకి తీసుకొస్తాం..



త్వరలోనే యార్డులో ఇద్దరు పారిశుద్ధ్య సిబ్బందిని నియమిస్తాం. అలాగే విద్యుత్ సౌకర్యం కూడా కల్పిస్తాం. డీఆర్ సీసీ, వర్మి కంపోస్టు కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం.

- రమేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

భూముల పట్టాలు పునరుద్ధరించాలి

సీపీఐ ఆధ్వర్యంలో వినతి



వినతి పత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు, బాధితులు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని పోతిరెడ్డిపల్లిలో గతంలో దళితులకు కేటాయించిన భూముల పట్టాలను పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కోరారు. గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దళితులతో కలిసి అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002లో దళితులకు కడవేర్గు రెవెన్యూ పరిధిలోని పోతిరెడ్డిపల్లి శివారులోని 453 సర్వే నంబరులోని 70 ఎకరాలను ఒక్కొక్కరికి ఎకరం చొప్పున పట్టాలు ఇచ్చి పాసు పుస్తకాలు పంపిణీ చేశారన్నారు. అప్పటి నుంచి భూములు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్న వారి నుంచి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ భూములను లాక్కుని పట్టాలు రద్దు చేసి ఫారెస్టు అధికారులకు స్వాధీనం చేసిందని వాపోయారు. నిరుపేదలైన దళితులకు ఇచ్చిన వ్యవసాయ భూములు లాక్కోవడం సరికాదని, ఆ పట్టాలను పునరుద్ధరించి భూములను తిరిగి అప్పగించాలని కోరారు. దీనిపై ఆర్ఐ ఐలయ్య స్పందిస్తూ ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, యాదగిరి, కనకయ్య, మమత, బాలవ్వ, కలవ్వ, మల్లమ్మ, లక్ష్మి, రానవ్వ, నరసమ్మ, కనకవ్వ, పుష్ప, జవవ్వ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి



మిరుదొడ్డిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మిరుదొడ్డిలో బుధవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో 100 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో భూ సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తొగుట(దుబ్బాక): భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద మాసాన్‌పల్లిలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగంచేసుకోవాలన్నారు. పెద్ద మాసాన్‌పల్లిలో 55, ఎల్లారెడ్డిపేటలో 76 దరఖాస్తులు స్వీకరించారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశాలు

గజ్వేల్‌రూరల్: బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన, విశాలమైన తరగతి గదులు, దూర ప్రాంత విద్యార్థులకు హాస్టల్ వసతి, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

వర్గల్ మహిళా డిగ్రీ కళాశాలలో..

వర్గల్(గజ్వేల్): వర్గల్ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ డాక్టర్ గడ్డం భాస్కర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుడ్ గవర్నెన్స్ ద్వారా 11 కోర్సులకు గాను మొదటి జాబితాలో 396 మంది విద్యార్థులకు ప్రవేశార్హత లభించిందని, వారంతా ఆరోతేదీలోగా చేరాలని అభ్యర్థులకు లేఖలు పంపించినట్లు తెలిపారు. నెలాఖరులోగా ప్రవేశాలు పూర్తవుతాయని, 30వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

అనుమానం వస్తే తనిఖీ తప్పనిసరి

ఏసీపీ సదానందం



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఏసీపీ సదానందం

కొమురవెల్లి(సిద్దిపేట): అనుమానాస్పదంగా ఉన్న ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం పోలీసులకు సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా గురిజకుంట వాగు సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కొన్ని సూచనలిచ్చారు. సిబ్బంది ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలని, పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని చెప్పారు. ఒకవేళ ఎవరైనా పశువులను రవాణా చేస్తే వారి వద్ద వెటర్నరీ డాక్టర్ ఇచ్చిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను పరిశీలించాలని, పశువుల అక్రమ రవాణా జరుగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమ కోటాలో మంత్రి పదవి ఇవ్వండి

జాతీయ మాల మహానాడు రాష్ట్ర నేత సుధాకర్



మాట్లాడుతున్న సుధాకర్

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ ఉద్యమకారుడు, కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు మంత్రి పదవి ఇవ్వాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ కోరారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మండలి నుంచి మంత్రి వర్గంలో ఎవరూ లేరని, ఈ ఆవకాశాన్ని ప్రభుత్వానికి అండగా నిలబడే అద్దంకికి ఇవ్వాలన్నారు. ముప్పై యేళ్లుగా రాజ్యాంగ రక్షణ కోసం పోరాడుతున్న సామాజిక ఉద్యమనేతని, అన్నివర్గాల వారికి అందుబాటులో ఉండే వ్యక్తిగా ఆయనకు మంచి పేరుందని చెప్పారు. ఆయన వెంట నాయకులు భైరి రమేశ్, సత్యనారాయణ, నరసింహ, భాస్కర్, విజయ్, శ్రీరాం వెంకటేశ్, నాగయ్య, కిషన్, కనకయ్య, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శివరామన్

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాములపర్తి గ్రామంలో మెదక్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం రైతులకు వికసిత సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డా.శివరామన్ మాట్లాడుతూ ఆర్ఎన్ఆర్ సన్నరకం(తెలంగాణ సోన) వరి విత్తనాలను జూన్ 20 తర్వాత నారు పోసుకోవాలని, జులై 15 తర్వాత నాట్లు వేసుకోవాలన్నారు. వర్షాకాలంలో పత్తి, ఇతర పంటలపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి సాగులో యాజమాన్య పద్ధతులను వివరించారు. ప్రభుత్వం అవలంబిస్తున్న పథకాల గురించి తెలియజేశారు. శాస్త్రవేత్తలు గోపాల్‌లాల్, ఎస్ఎంఎస్ ఆర్ఎం, రవి కుమార్, రమేశ్ నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి మునిర బేగం, రైతులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాల పండగకు రండి

ఎంపీ రఘునందన్‌రావుకు ఆహ్వానం



ఎంపీ రఘునందన్‌రావుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాయకులు

దుబ్బాక: దుబ్బాకలో 6, 7, 8వ తేదీలలో జరగనున్న పోచమ్మ బోనాల ఉత్సవాలకు రావాలని బాబూజగ్జీవన్‌రామ్ సంఘం నేతలు ఎంపీ రఘునందన్‌రావుకు బుధవారం ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తప్పకుండా ఉత్సవాలకు హాజరవుతానన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజమల్లు, నాయకులు రాంచంద్రం, యాదగిరి, రవి, భద్రి, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎవరూ ఆందోళన చెందొద్దు
- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

బెజ్జంకి(సిద్దిపేట): ఇళ్లులేని ప్రతి నిరుపేదకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. బెజ్జంకిలో పలువురు లబ్ధిదారులకు బుధవారం ఆయన అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి పనిచేస్తున్నారన్నారు. బెజ్జంకిలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ఉష ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, తహసీల్దార్ చంద్రశేఖర్, హౌసింగ్ పీడీ దామోదర్‌రావు, ఏఎంసీ చైర్మన్ కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

అక్కన్నపేట(హుస్నాబాద్): సొంతింటి కలను సాకారం చేయడం ద్వారా పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తున్నామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. అక్కన్నపేట రైతు వేదికలో 357 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరు పత్రాలు పొందిన వారు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ శివయ్య, ఎంపీడీఓ జయరాం, నాయకులు ప్రవీణ్, ఐల్లయ్య, ముకుందంరెడ్డి, రవి, సంజీవ్‌రెడ్డి, దాము, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండారుపల్లిలో పోలీసుల ‘కనువిప్పు’

ఎస్‌ఐ రవికాంత్‌రావు

తొగుట(దుబ్బాక): నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ రవికాంత్‌రావు సూచించారు. మండలంలోని బండారుపల్లిలో పోలీసులు మంగళవారం రాత్రి కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకురావాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, క్రికెట్ బెట్టింగ్‌లతో యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలే గాని భయపడి ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించింది. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిసాన్ మేళా ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ సదానందం

హుస్నాబాద్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో 6, 7, 8వ తేదీలల్లో నిర్వహించనున్న కిసాన్ మేళా ఏర్పాట్లను ఏసీపీ సదానందం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిసాన్ మేళాకు మంత్రులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మేళాకు వచ్చే రైతులు తప్పనిసరిగా పోలీసుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ మహేశ్ ఉన్నారు.

అధిక సాంద్రత పత్తితో ఎంతో మేలు



హ్యాండ్‌పుష్ యంత్రాన్ని అందజేస్తున్న రాంరెడ్డి

తొగుట(దుబ్బాక): అధిక సాంద్రత పత్తిసాగుతో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని రైతు ఉత్పత్తిదారుల సహకారం సంఘం అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి తెలిపారు. మండలంలోని వెంకట్రావుపేటలో నూజివీడు సీడ్స్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోషల్ రెస్పాన్స్ ఫండ్‌లో భాగంగా సంఘానికి హాండ్‌పుష్ సీడర్ యంత్రాన్ని అందజేశారు. అనంతరం ఆ కంపెనీ సీనియర్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆర్మిత-2788బీజీ-2 రకం పత్తి విత్తనాలు ఎకరానికి ఐదు ప్యాకెట్లు చొప్పున నాటుకుంటే ఎకరాకు 15-20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. అమెరికా, చైనా, బ్రెజిల్ దేశాల్లో అధిక సాంద్రతతో అధిక దిగుబడులు సాధిస్తున్నారని తెలిపారు. వెంకటారావుపేటలో 120 ఎకరాల్లో సాగుచేసేందుకు రైతులు ముందుకు వచ్చారని చెప్పారు. రైతులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికడదాం


ట్రాఫిక్ సీఐ మురళి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ మురళి

గజ్వేల్‌రూరల్: రోడ్డు నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికడదామని ట్రాఫిక్ సీఐ మురళి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద బుధవారం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. రాంగ్‌రూట్లో ప్రయాణం, వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, మితిమీరిన వేగం, మద్యం తాగి నడపడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్‌ఐ జగదీశ్వర్, హెడ్‌కానిస్టేబుల్ సాంబశివరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని తాడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు కలిసి చదివుకున్న విద్యార్థులు 22 సంవత్సరాల తర్వాత ఒక చోట కలుసుకుని ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్, యాదగిరి, మల్లేశం, ఓజల్, నర్సింహులు, రామచంద్రారెడ్డి, ఉమారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.